


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

రిపోర్టర్లు కావాలి.

సంప్రదించండి... 9490056011,9603969335



సంపుటి : 4 | సంచిక : 4 | సెప్టెంబర్ 9 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# సూచనలు ఇస్తుంటే.. నిద్రలోకి జారుకున్న రూరల్ సీఐ!

## గణేష్ ఉత్సవాల భద్రతపై జిల్లా పోలీస్ బాస్ కీలక సూచనలు.. మరోవైపు సీఐ తీరుపై అధికారుల విస్మయం







**మన దునియా,నిజామాబాద్ జిల్లా:సెప్టెంబర్ 08**

జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై జిల్లా పోలీస్ బాస్ అధికారులకు కీలక సూచనలు చేస్తున్న సమయంలో ఓ రూరల్ సీఐ నిద్రలోకి జారుకున్నట్లు కనిపించడం చర్చనీయాంశంగా మారింది.గణేష్ ఉత్సవాల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ఊరేగింపుల నిర్వహణ, సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు వంటి

- గణేష్ ఉత్సవాల భద్రతపై జిల్లా పోలీస్ బాస్ కీలక సూచనలు.. మరోవైపు సీఐ తీరుపై అధికారుల విస్మయం
- శాంతిభద్రతల పరిరక్షణలో కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సిన అధికారి ఇలా కనిపించడంపై చర్చ
- సమీక్షా సమావేశంలోనే నిద్ర? పోలీస్ శాఖలో అధికారుల అప్రమత్తతపై సందేహాలు
- ప్రజా భద్రతకు సంబంధించిన సమావేశాల పట్ల ఇదేనా బాధ్యత?
- ఉన్నతాధికారుల సూచనలు ఎంతవరకు అమలవుతున్నాయి?

## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం

(మిగతా 2వ పేజీలో..)



## నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు..

### హరీష్ రావుపై స్పీకర్ ఆగ్రహం

**మన దునియా,హైదరాబాద్: సెప్టెంబర్ 08**

రెండోరోజు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీ వేడిగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అసెంబ్లీ బయట జరిగిన పరిణామాలపై నేడు.. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. స్పీకర్ పై



(మిగతా 2వ పేజీలో..)

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన



(మిగతా 2వ పేజీలో..)

## మన దునియాకు స్పందన.. ప్రత్యేక టీములు ముమ్మర తనిఖీలు!

- పేకాట నిర్వాహకులు, స్థావరాలపై ఇంటెలిజెన్స్ ఆరా..!
- అడ్డాలు ఎక్కడ..? నిర్వాహకులు ఎవరు..? కదలికలపై నిఘా
- జుక్కల్, మద్నూర్, బిచ్కుందలో పెరిగిన నిఘా?
- పేకాట నిర్వాహకుల్లో మొదలైన కలవరం..
- ఇకనైనా పేకాటకు చెక్ పడుతుందా?

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, మన దునియా ၊ బాన్సువాడ, సెప్టెంబర్ 8:**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పరిసరాల్లో పేకాట కార్యకలాపాలపై "మన దునియా" ప్రచురించిన ప్రత్యేక కథనానికి స్పందన లభించినట్లు తెలుస్తోంది. పేకాట నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్వాహకులు, జూదం సాగుతున్నట్లు చెబుతున్న స్థావరాలపై నిఘా వర్గాలు దృష్టి సారించినట్లు సమాచారం.జుక్కల్, మద్నూర్, బిచ్కుంద మండలాల్లో పేకాట నిర్వహిస్తున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో స్థావరాలు ఎక్కడ ఉన్నాయి? నిర్వాహకులు ఎవరు? వారి కదలికలు ఎలా ఉన్నాయి? అనే అంశాలపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.





మన దునియా ఎఫెక్ట్

స్థావరాలపై నిఘా..

పేకాటకు అడ్డుకట్ట వేసే దిశగా అనుమానిత స్థావరాలు, నిర్వాహకుల

(మిగతా 2వ పేజీలో..)

మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

# నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు..

చేసిన వ్యాఖ్యలపై తాతా మధు ఇప్పటికే విచారం వ్యక్తం చేశారని అయినా..అరెస్ట్ చేశారని హరీష్ వాపోయారు. సునీత చీరలాగడం, సబితా ఇంద్రారెడ్డి మెడ పట్టుకోవడంపై హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనలకు బాధ్యులపై చర్యలు తీసుకోరా ? అని ఫైరయ్యారు. అందుకు స్పీకర్ బదులిచ్చారు. విచారణ జరుగుతోందని, వచ్చాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా శాసనసభ్యులంటే సభతో పాటు తనకు కూడా గౌరవం ఉందన్నారు. అలాగే తనను అన్న మాటకు ఏం సమాధానం చెప్తావ్ హరీష్ అంటూ నిలదీశారు. సభలో ఎందుకంత ఆవేశపడుతున్నారని నిలదీశారు. నిజానికి తన తల్లిని దూషించారని, తనకు ఆవేశం ఉండాలి కానీ.. నువ్వెందుకు ఆవేశపడుతున్నావంటూ ఫైరయ్యారు. అలాగే తన తల్లిని దూషించిన దానికి సమాధానం చెప్పు హరీష్ రావు అంటూ నిలదీశారు. అధికార కాంగ్రెస్.. ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్న నేపథ్యంలో సభను 15 నిమిషాలపాటు వాయిదా వేశారు.

## మన దునియాకు స్పందన.. ప్రత్యేక టీములు ముమ్మర తనిఖీలు!

(మొదటి పేజీ తరువాయి)

కదలికలు, నిర్వహణ తీరుపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పేకాట నిర్వాహకుల్లో కలవరం మొదలైనట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

పేకాటరాయుళ్లలో గుబులు?

ఇంటెలిజెన్స్ వర్గాల ఆరాతో పేకాట కార్యకలాపాలకు సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఆందోళన మొదలైనట్లు సమాచారం. అయితే అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదా చర్యల వివరాలు వెలువడాల్సి ఉంది. ఇకనైనా పేకాటకు చెక్ పడుతుందా? పేకాట కార్యకలాపాలపై నిఘా కొనసాగుతున్న నేపథ్యంలో ఇకనైనా అక్రమ జూదానికి అడ్డుకట్ట పడుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు.అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు.దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.



# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

(మొదటి పేజీ తరువాయి)

గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు.ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు.ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి.వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం**

**తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ**

**స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం**

**కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్**



బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర

స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

# సూచనలు ఇస్తుంటే.. నిద్రలోకి జారుకున్న రూరల్ సీఐ!

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై పోలీస్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంటుంది. ఇలాంటి కీలక సమావేశంలో బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న అధికారి నిద్రిస్తున్నట్లుగా కనిపించడంతో సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజల భద్రతతో ముడిపడి ఉన్న అంశాలపై ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్న సమయంలోనే అధికారి ఇలా కనిపించడం పోలీస్ శాఖలో చర్చకు దారితీసింది.



సమావేశంలో చెప్పిన సూచనలు క్షేత్రస్థాయిలో ఎంత వరకు అమలవుతున్నాయనే సందేహాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే సీఐ నిజంగానే నిద్రపోయారా? లేక కొద్దిసేపు విశ్రాంతిగా కూర్చున్న సమయంలో అలా కనిపించారా? అన్నది అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే అధికారులు ఇలాంటి సమావేశాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని పలువురు కోరుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# టైగర్ జోన్ పేరుతో ఆదివాసులను వేధిస్తే సహించం





**పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి.. టైగర్ లేని టైగర్ జోన్‌ను ఎత్తివేయాలి**

**తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మరుమల మల్లేశ్వరి**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;సెప్టెంబర్ 8 :**

జన్నారం మండలంలోని ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములను సమగ్రంగా సర్వే చేసి అర్హులైన వారికి వెంటనే హక్కు పత్రాలు మంజూరు చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మరుమల మల్లేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కవ్వాల్ టైగర్ జోన్ పేరుతో ఆదివాసులను ఇబ్బందులకు గురిచేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రెండో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, పోడు భూములు, అటవీ హక్కులు, మౌలిక వసతులపై మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేశారు.మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు నిర్మాణ, అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుకను తెచ్చుకునే అవకాశం కల్పించాలని, అభివృద్ధి పనులకు అటవీ శాఖ అధికారులు అడ్డంకులు సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని మల్లేశ్వరి కోరారు. ఆదివాసుల ఇందిరమ్మ ఇళ్లకు రోడ్డు సౌకర్యం, ఇసుక అందుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో ఆదివాసులకు నష్టం కలిగించే విధానాలను, వారిని వేధించే చర్యలను అటవీ అధికారులు వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు.ఆదివాసీ గూడాల్లో విద్య, వైద్యం, పౌరసరఫరాల సరుకులను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల కమిటీల ద్వారా ఆర్ఓఎఫ్ఆర్ సర్వే నిర్వహించేందుకు ఫారం--ఏ దరఖాస్తులను చట్ట ప్రకారం గ్రామసభల్లో స్వీకరించాలని కోరారు.టైగర్ లేని టైగర్ జోన్‌ను ఎత్తివేసి జన్నారం మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని మహాసభ డిమాండ్ చేసింది. ఆదివాసుల హక్కులను పరిరక్షించేందుకు భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు ప్రకటించారు.



నూతన మండల కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జన్నారం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఆత్రం రవికుమార్, మూతి రాజేందర్ ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా గుజిగంటి ప్రకాష్, పరాచ గిరిజాబాయి, యశోద; సహాయ కార్యదర్శులుగా గడ్డం విజయ్, సట్ల భీమయ్య, తుంరాం మారుపటేల్ ఎన్నికయ్యారు.మండల కమిటీ సభ్యులుగా ఆత్రం రాజు, పంద్రం శారదతో పాటు మరో పది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని మహాసభలో పిలుపునిచ్చారు.

# ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టులు సరికాదు

**సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌కు వెళ్తుంటే అడ్డుకోవడం అన్యాయం**

**18 వేల రూపాయల ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలి: సీఐటీయూ నాయకులు**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;సెప్టెంబర్ 8:**



ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ సీనియర్ నాయకులు కూకటీకారు బుచ్చయ్య తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న మహిళా కార్మికులను అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.గత 20 ఏళ్లుగా ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు అందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వీరిలో అత్యధికులు మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనని, ఇంతకాలం సేవలందిస్తున్నప్పటికీ వారికి కనీస చట్టబద్ధ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత, గ్యారంటీ ఫిక్స్‌డ్ వేతనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు పలు హామీలు ఇచ్చినా వాటిని అమలు చేయలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఆశా వర్కర్ల ప్రధాన సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు.సీఐటీయూ నాయకురాలు కామ్రేడ్ నీరజ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. పీఆర్సీ ఏరియర్స్‌తో పాటు లెప్రసీ, పల్స్ పోలియో, ఎన్నికల విధులకు సంబంధించిన పారితోషికాలు కూడా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ఆశా వర్కర్లకు కనీసం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన వారిలో జి. శైలజ, ఎం. లక్ష్మి, టి. రాజేశ్వరి, డి. వజ్రమాల, కళావతి, ఆర్. గంగామణి, సుజాత, పి. రమ, కే. సునీత, ఎం. శైలజ, ఎం. భూమక్క, డి. సూర్య తదితర ఆశా వర్కర్లు ఉన్నారు.ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

# ఎడ్లపాడు మండలంలో రోడ్డు ప్రమాదం - ఒకరు మృతి

**చిలకలూరిపేట మన దునియా డెస్క్ న్యూస్**

చిలకలూరిపేట :- ఎడ్లపాడు మండలం సంగంగోపాలాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్నేహితుడిని కలిసేందుకు వెళ్తుండగా ప్రమాదం మృతుడిని గుంటూరు ఆనంద్‌పేట-2కు చెందిన మహమ్మద్ హుస్సేన్ (43)గా గుర్తించారు. స్నేహితుడిని కలిసేందుకు మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.



## అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఉపసర్పంచుల అరెస్ట్

**జన్నారంలో ముందస్తుగా అదుపులోకి తీసుకున్న పోలీసులు.. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం ఆగదు**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;సెప్టెంబర్ 8:**




తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం పిలుపునిచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హైదరాబాద్ బయలుదేరుతున్న మంచిర్యాల జిల్లా జన్నారం మండల ఉపసర్పంచులను జన్నారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఉపసర్పంచుల న్యాయమైన అధికార హక్కులు, విధులు, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో పాల్గొనేందుకు వారు హైదరాబాద్‌కు బయలుదేరారు.రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు బోట్ల కార్తిక్ ఇచ్చిన పిలుపు మేరకు జన్నారం మండలానికి చెందిన పలువురు ఉపసర్పంచులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరగా, పోలీసులు వారిని మార్గమధ్యంలోనే అడ్డుకుని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం సరికాదని ఉపసర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామపంచాయతీల అభివృద్ధిలో ఉపసర్పంచులకు కీలక బాధ్యతలు ఉన్నప్పటికీ, తమకు తగిన అధికారాలు, విధులు, గౌరవం కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆరోపించారు. ఉపసర్పంచుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారికి చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, ఉపసర్పంచులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచులు తేజావత్ భరత్, నల్లతీగల విష్ణు, పిండి నరేష్, మామిడి శెట్టి విలాస్, దుర్గం మహేందర్, మేక భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి క్వార్టర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

**తాళాలు పగులగొట్టి ఆధీనంలోకి.. సామగ్రి తరలింపునకు చర్యలు**

**మన దునియా, సెప్టెంబర్ 08,మంచిర్యాల జిల్లా**



మందమర్రి పట్టణం లో మద్ది శంకర్ నివాసం ఉంటున్న సింగరేణి క్వార్టర్‌ను మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్టేట్ జూనియర్ ఆఫీసర్ ఆసిఫ్, క్వార్టర్ సెక్షన్ ఇన్‌చార్జి సీనియర్ పీఓ కార్తీక్, ఏరియా యాక్టింగ్ సెక్యూరిటీ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్అండ్‌పీసీ, సివిల్ విభాగాల సిబ్బంది క్వార్టర్ వద్దకు చేరుకుని తాళాలు పగులగొట్టి క్వార్టర్‌ను సింగరేణి ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం క్వార్టర్‌లోని ఇంటి సామగ్రిని స్వాధీనం చేసుకుని సింగరేణి డ్యూటీ డీసీఎం వాహనంలో ఎస్అండ్‌టీసీ కార్యాలయానికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మందమర్రి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.క్వార్టర్ స్వాధీనానికి దారితీసిన కారణాలు, అధికారిక ఉత్తర్వులు, నిబంధనలకు సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా, పై అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే క్వార్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు, సంబంధిత అధికారిక ఉత్తర్వులు వెల్లడైతే ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

## డ్యూటీలో ఉన్న పోలీసులను కొట్టిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలి: మంత్రి సీతక్క

**మన దునియా,హైదరాబాద్,సెప్టెంబర్ 08**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి.. తాము చేయలేదని అంటున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఈరోజు(మంగళవారం) శాసనసభలో మాట్లాడుతూ.. మాజీ మంత్రిసబితా ఇంద్రారెడ్డిని తోసింది ఎవరని ప్రశ్నించారు. మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులను ముందు పెట్టుకుని రావాలని ఎందుకు చూశారని నిలదీశారు. 'మహిళా ఎమ్మెల్యేలను సేఫ్టీ ప్లేస్‌లోకి పంపి.. ఆ తర్వాత మీరు రావాల్సింది' అని అన్నారు.మహిళా పోలీస్ ఆఫీసర్‌పై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకున్నారని.. వారిని తిట్టారని చెప్పారు. వీటికి సంబంధించి అన్ని విజువల్స్ ఉన్నాయన్నారు. డ్యూటీలో ఉన్న పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనసభ దేవాలయం లాంటిందన్నారు. బీఆర్ఎస్ మహిళా నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. హరీశ్ రావును ఏదో అంటే కవితను పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించారని మంత్రి సీతక్క ప్రశ్నించారు..



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# ఐఏఎస్ నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రెటరీ మృతి

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 08**



హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో మంగళవారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీ రాజు, అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలాడు. ఈ అనూహ్య పరిణామాన్ని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి అత్యం త సమయస్ఫూర్తితో వ్యవహరించారు. వెంటనే రాజు వద్దకు చేరుకుని ఆయనకు సీపీఆర్ చేసి ప్రథమ చికిత్స అందించేం దుకు తీవ్రంగా ప్రయత్నించారు. అనంతరం వెంటనే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి, బాధితుడిని అంబు లెన్స్‌లో హుటాహు టిన ఆసు పత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. అయితే, రాజును ఆసుపత్రికి చేర్చేసరికే పల్స్ పూర్తిగా పడిపోవడంతో... ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరిం చారు. మంత్రి శ్రీహరి తన వంతు ప్రయ త్నంగా ప్రాణాలు నిలపడానికి చేసిన యత్నం అక్కడి వారిని కలచివేసింది.

# కెసిఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి దళిత సంఘాల పిలుపు!

**ఫామ్ హౌస్ వద్ద 144 సెక్షన్ అమలు**

**మన దునియా,సిద్దిపేట జిల్లా:సెప్టెంబర్ 08**



గజ్వేల్ నియోజక వర్గంలోని ఎర్రవెల్లి లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నిరసనలకు దిగింది ఈరోజు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి పిలుపు నిచ్చింది, ఈ నేప థ్యంలో 144 సెక్షన్ విధించింది పోలీసు లు భారీగా భద్రతను మోహరించారు. 144 సెక్షన్ అమల్లో ఉండడంతో కేసీఆర్ ఫామ్ హౌస్ వైపు ఎవరిని అనుమతిం చడం లేదు అటు వైపు అన్ని మార్గాల ను భారీ కేడ్లతో మూసివేశారు దీంతో ఫామ్ హౌస్ చుట్టు పోలీసులు పహారా కాస్తున్నారు. దళిత కాంగ్రెస్ నేతలు అధిక సంఖ్యలో ముట్టడికి వస్తుండటంతో అన్ని దారుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పోలీసులు తనిఖీ చేస్తున్నారు. దీంతో సిద్ధిపేట జల్లా గజ్వేల్ లో టెన్షన్ నెలకొంది. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చిన అనంతరం మాత్రమే పోలీసులు ఆ రహదారిలో ప్రయాణానికి అనుమతిస్తున్నారు.

## నిరసనను అడ్డుకునేందుకే ముందస్తు అరెస్టులా..?

**బీఆర్ఎస్ నాయకుల అరెస్టులపై తీవ్ర ఆగ్రహం.. గొంతు నొక్కలేరని హెచ్చరిక**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం; సెప్టెంబర్ 8:**

తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు జన్నారం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, శాంతియుతంగా ఆందోళన చేపట్టేందుకు సిద్ధమైన నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయలేరని అన్నారు. ముందస్తుగా అరెస్టయిన వారిలో సర్పంచ్ పేరం శ్రీనివాస్, సుతారి వినయ్ కుమార్, ఫజల్ ఖాన్, ఉపసర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, జాడి గంగాధర్, ప్రేమ్ సాగర్, శ్రీనివాస్ గౌడ్, యువ నాయకుడు బాధవత్ సాయికిరణ్, అప్పని సాయికుమార్ తదితర బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు అన్నారు. అరెస్టులతో బీఆర్ఎస్ నాయకుల గొంతులను అణచలేరని.. ప్రజా సమస్యలపై ప్రశ్నించే స్వరాలను ఆపలేరని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.



# ఉప సర్పంచ్ల నాయకులను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధం

**మన దునియా, సెప్టెంబర్ 08,మంచిర్యాల జిల్లా**



ఉప సర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ అన్న పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రంలోని ఉప సర్పంచ్ల హక్కుల సాధన కోసం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి మందమర్రి మండలం నుంచి వివిధ గ్రామాల ఉప సర్పంచ్లు, ఉప సర్పంచ్ల ఫోరం నాయకులు బయలుదేరారు.ఈ సందర్భంగా మందమర్రి మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గిర్నాటి జనార్ధన్, వివిధ గ్రామాల ఉప సర్పంచ్లను రామకృష్ణాపూర్, మందమర్రి పోలీసులు పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం జరిగిందనిఉప సర్పంచ్లు ప్రభుత్వం వద్ద ఏ వ్యక్తిగత ప్రయోజనాల కోసం, ఏ రాజకీయ లబ్ధి కోసం వెళ్లడం లేదు. గ్రామ ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులుగా తమకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన కనీస హక్కుల కోసం మాత్రమే శాంతియుతంగా తమ గొంతును వినిపించడానికి బయలుదేరారు.మా ప్రధాన డిమాండ్లు ఏమిటంటే:- ఉప సర్పంచ్లకు తగిన గౌరవ వేతనం కల్పించాలి- గ్రామపంచాయతీలలో ఉప సర్పంచ్లకు జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలి- గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలపై ఉప సర్పంచ్ల పేర్లను కూడా పొందుపరచాలి- గ్రామపంచాయతీ పాలనలో ఉప సర్పంచ్లకు తగిన అధికారాలు, బాధ్యతలు కల్పించాలి- వార్డు సభ్యులకు కూడా తగిన గౌరవ వేతనం అందించాలి ప్రజల చేత ఎన్నుకోబడిన ఉప సర్పంచ్ల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలి.ఇవి ఏవీ అసాధారణమైన డిమాండ్లు కావు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం, గుర్తింపు అధికారాలు కల్పించాలనే న్యాయమైన డిమాండ్లు మాత్రమే.అలాంటి చిన్నచిన్న, న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా అసెంబ్లీ వద్ద తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికి బయలుదేరిన ఉప సర్పంచ్లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం తీవ్రంగా ఖండిస్తున్నాము.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, ప్రతి ప్రజాప్రతినిధికి ఉంది. తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడానికి వెళ్తున్న ఉప సర్పంచ్లను అడ్డుకోవడం ద్వారా సమస్యలు పరిష్కారం కావు.ప్రభుత్వం ఉప సర్పంచ్ల సమస్యలను వెంటనే గుర్తించి, రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం నాయకులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నాము.పాల్గొన్న ఉపసర్పంచ్లు దుర్గం శ్రీనివాస్ పోరెడ్డి మొండి రాజన్న ఎమ్బాడీ సతీష్ దుర్గం పోశం ఉప సర్పంచ్ల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది. ఉప సర్పంచ్ల ఫోరం మందమర్రి మండలం, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గిర్నాటి జనార్ధన్, మందమర్రి మండలంలోని వివిధ గ్రామాల ఉప సర్పంచ్లు, ఉప సర్పంచ్ల ఫోరం నాయకులు పాల్గొన్నారు.

# పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్

**16 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు**

**ముగ్గురు ఉపాధి సిబ్బందిపై చర్యలకు ఆదేశం**

**మన దునియా,హైదరాబాద్:తుంగతుర్తి 08**

విబి–జి రాంజి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రోజువారీ కూలీలకు నిరంతరం పని కల్పించాలని, ప్రతి కూలీకి రోజుకు కనీసం రూ. 300 ఉపాధి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఎంపీఓలు, విబి జి రాంజీ సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబంది,అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీల సంఖ్యను పెంచాలి.. రోజుకు రూ. 300 దక్కాలి గ్రామీణ ప్రాంతాల్లో లేబర్ మొబిలైజేషన్ (కూలీల సంఖ్య) ను తక్షణమే పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) పథకం కింద మంజూరైన ఇందిరమ్మ మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటికి సంబంధించిన పేమెంట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీటితో పాటు డ్రైన్ ఎండ్ సోక్ పిట్లు, వీఓ/ఎస్ హెచ్ జీ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఎక్కడా జాప్యం జరగకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

16 మంది కార్యదర్శులకు షోకాజ్.. ముగ్గురు సిబ్బందిపై చర్యలు

విధుల పట్ల నిర్లక్ష్యం వహించి, పనుల్లో అలసత్వాన్ని ప్రదర్శించిన 16 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఆర్డిఓ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే విబి జి రాంజీ సిబ్బందిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక ఏపీఓ , ఒక కంప్యూటర్ ఆపరేటర్ మరియు ఒక ఈసీలపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో



నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్డిఓ సన్యాసయ్య జెడ్పి సీఈఓ డి శిరీష డిపిఓ యాదగిరి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్

**16 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు**

**ముగ్గురు ఉపాధి సిబ్బందిపై చర్యలకు ఆదేశం**

**మన దునియా,తుంగతుర్తి:సెప్టెంబర్ 08**

విబి–జి రాంజి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రోజువారీ కూలీలకు నిరంతరం పని కల్పించాలని, ప్రతి కూలీకి రోజుకు కనీసం రూ. 300 ఉపాధి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఎంపీఓలు, విబి జి రాంజీ సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబంది,అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కూలీల సంఖ్యను పెంచాలి.. రోజుకు రూ. 300 దక్కాలి**

గ్రామీణ ప్రాంతాల్లో లేబర్ మొబిలైజేషన్ (కూలీల సంఖ్య) ను తక్షణమే పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) పథకం కింద మంజూరైన ఇందిరమ్మ మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటికి సంబంధించిన పేమెంట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీటితో పాటు డ్రైన్ ఎండ్ సోక్ పిట్లు, వీఓ/ఎస్ హెచ్ జీ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఎక్కడా జాప్యం జరగకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**16 మంది కార్యదర్శులకు షోకాజ్.. ముగ్గురు సిబ్బందిపై చర్యలు**

విధుల పట్ల నిర్లక్ష్యం వహించి, పనుల్లో అలసత్వాన్ని ప్రదర్శించిన 16 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఆర్డిఓ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే విబి జి రాంజీ సిబ్బందిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక ఏపీఓ , ఒక కంప్యూటర్ ఆపరేటర్ మరియు ఒక ఈసీలపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్డిఓ సన్యాసయ్య జెడ్పి సీఈఓ డి శిరీష డిపిఓ యాదగిరి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# వారెంట్ అమల్లో ఉండగా విదేశాలకు ఎలా వెళ్తారు?:

**ఐఏఎస్ అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం**

**మన దునియా,హైదరాబాద్: సెప్టెంబర్ 08**

కోర్టు ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో పాటు విచారణకు సరిగా హాజరుకాని సీనియర్ ఐఏఎస్ అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.కోర్టు ధిక్కరణ కేసులో బెయిలబుల్ వారెంట్ అమల్లో ఉన్నప్పుడు అధికారులు విదేశీ పర్యటనలకు ఎలా వెళ్తారని, ఒకవేళ ఎయిర్ పోర్టులోనే వారిని అరెస్ట్ చేసి ఉంటే పరిస్థితి ఏంటని తీవ్ర స్థాయిలో ప్రశ్నించింది. వివరాల్లోకి వెళితే.. భూసేకరణ ప్రక్రియలో కోర్టు నిర్ణయించిన పరిహారంలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. ఆ ఉత్తర్వులను అమలు చేయడంలో తీవ్ర ఆలస్యం జరగడం, బాధితులకు పరిహారం అందకపోవడంతో బాధితులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రోడ్లు-భవనాల (R&B) శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్‌లకు హైకోర్టు బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది.

**కోర్టులో వాడీవేడి వాదనలు..**

విచారణ సందర్భంలో అధికారులు హాజరుకాకపోవడంపై ప్రభుత్వం తరపు న్యాయవాదులు వివరణ ఇస్తూ.. అసెంబ్లీ సమావేశాల రద్దీ కారణంగా అధికారులు కోర్టుకు రాలేకపోయారని తెలపగా, ఆర్థిక శాఖ అధికారి విదేశీ పర్యటనలో ఉన్నారని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఫారం-1 నోటీసులు, బెయిలబుల్ వారెంట్లు అమల్లో ఉన్న సమయంలో అధికారులు విదేశాలకు వెళ్లడం ఏంటని ఆక్షేపించారు. విదేశాలకు వెళ్లే క్రమంలో



విమానాశ్రయంలోనే వారిని అరెస్ట్ చేసి ఉంటే విభాగానికి, ప్రభుత్వానికి ఏం గౌరవం ఉండేదని ప్రశ్నించారు. కోర్టు తీర్పు ఇచ్చాక కూడా "బడ్జెట్ లేదు, నిధులు అందుబాటులో ఉన్నప్పుడు ప్రాధాన్యత క్రమంలో ఇస్తాం" అని సమాధానాలు చెప్పడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారుల తరపున ప్రభుత్వ న్యాయవాదులు స్పందిస్తూ.. బాధితులకు ఇటీవల పరిహారం మొత్తాన్ని పూర్తిగా చెల్లించామని కోర్టుకు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగవని, అధికారుల గైర్హాజరుకు క్షమాపణలు కోరుతూ అఫిడవిట్ దాఖలు చేయడంతో హైకోర్టు ఈ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ముగించింది.

# హాస్టల్లో ఇబ్బందులు.. కన్నీళ్లు పెట్టుకున్న విద్యార్థులు!

**ఏటూరునాగారం గిరిజన బాలికల హాస్టల్‌లో దుస్థితి?**

**మన దునియా,ములుగు జిల్లా,ఏటూరునాగారం:సెప్టెంబర్ 08**

గిరిజన విద్యార్థినుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఏటూరునాగారం ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌పై తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కూడా లేవని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. తమ సమస్యలను వివరిస్తూ కంటతడి పెట్టారు.

తాగునీటికి కటకట..

హాస్టల్‌లో తాగునీటి సౌకర్యం సరిగా లేదని విద్యార్థినులు చెబుతున్నారు. స్నానానికి ఉపయోగించే నీటినే తాగేందుకు కూడా వినియోగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆహారంపై ఫిర్యాదులు

హాస్టల్‌లో అందించే ఆహారంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు ఆరోపించారు. నాణ్యమైన ఆహారం అందించాలని కోరుతున్నారు.

వాష్‌రూమ్‌ల పరిస్థితిపై ఆందోళన

వాష్‌రూమ్‌లు, పారిశుధ్య పరిస్థితులు కూడా సరిగా లేవని విద్యార్థినులు చెబుతున్నారు. కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

సిబ్బందిపై సంచలన ఆరోపణలు

తమ సమస్యలను చెప్పుకుంటే కొందరు సిబ్బంది బూతులు తిడుతూ, కొడుతున్నారని విద్యార్థినులు ఆరోపించారు. ఈ ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి.

అధికారులు స్పందించాల్సిందే!

మైనర్ విద్యార్థినులు ఉంటున్న వసతి గృహంలో తాగునీరు, ఆహారం, పారిశుధ్యం, భద్రత వంటి అంశాలపై ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థినుల ఆరోపణలపై సంబంధిత అధికారులు తక్షణమే హాస్టల్‌ను తనిఖీ చేసి, సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

# బోధన్‌లో ఉద్రిక్తత.. బాహాబాహికి దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బాహాబాహికి దిగడంతో బోధన్ పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బాహాబాహికి దిగడంతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది.

పట్టణంలోని అంబేద్కర్? చౌరస్తా వద్ద..

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యిరోజుల పాలనపై బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపేందుకు అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. అనంతరం ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఒక్కసారిగా చౌరస్తా వద్ద ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్?ఎస్? నాయకులు అంబేద్కర్? విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. అయితే స్పీకర్?ను అవమానించిన బీఆర్?ఎస్? నాయకులు అంబేద్కర్?కు వినతిపత్రం ఇచ్చే నైతిక హక్కు లేదని పేర్కొంటూ కాంగ్రెస్? నాయకులు ఆగ్రహించారు. అనంతరం అంబేద్కర్? విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, ఆదినారాయణ, మీర్? గౌస్, పట్టణ కాంగ్రెస్? అధ్యక్షుడు అంకు దాము, బీఆర్ఎస్ నాయకులు ముషీర్, బాబా, మోబిన్ ఖాన్, గుమ్ముల అశోక్ రెడ్డి, పట్టణ బీఆర్?ఎస్? అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ మంత్రి విడదల రజిని

**చిలకలూరిపేట మన దునియా డెస్క్ న్యూస్.**



ఈరోజు తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మాజీ మంత్రి విడదల రజిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలపై చర్చ ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించినట్లు తెలుస్తోంది. చిలకలూరిపేట నియోజకవర్గం లో పార్టీ బలోపేతంపై కూడా జగన్‌కు రజిని వివరించినట్లు సమాచారం.

## ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో షాద్ నగర్ ఎమ్మెల్యే పై ఫిర్యాదు

**ఎమ్మెల్యే శంకరయ్య వ్యాఖ్యలపై భగ్గుమన్న బారాస నేతలు**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**




తెలంగాణ రాష్ట్రంలో రానురాను కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మితిమీరిపోతుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలు మంత్రులు వారి యొక్క మాట తీరు మితిమీరిపోతున్నా యని హద్దు అదుపు లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైనది కాదని భరాసా శ్రేణులు తీవ్రగ్రహం వ్యక్తం చేశారు మంగళవారం షాద్ నగర్ ఎమ్మెల్యే శంకరయ్య బారాస అధినేత కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా ఆయన చావు కోరుకుంటున్నానని బహిరంగంగా ప్రకటించడం సిగ్గుచేటు అని వారన్నారు ఈ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో షాద్ నగర్ ఎమ్మెల్యే శంకరయ్య పై ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా ఎల్లారెడ్డి బారాస పట్టణ అధ్యక్షులు ఆదిమూలం సతీష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసినటువంటి కెసిఆర్ గారి చావు కోరడం సరైన పద్ధతి కాదని దీనివలన కేసీఆర్ గారి ప్రాణాలకు ముప్పు ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు ఇలాంటి వాక్యాలు చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని ఆయన అన్నారు కేసీఆర్ గారి పై చేసిన వ్యాఖ్యలపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షులు ఏగుల నర్సింలు శ్రవణ్ సాయిలు బబ్లు నాగం రాజయ్య ఇమ్రాన్ బర్కత్ అజయ్ పాండు పృథ్వీరాజ్ అరవింద్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

## హరీష్ రావు స్పీకర్‌ను బెదిరించేలా మాట్లాడుతున్నారు:మంత్రి శ్రీధర్ బాబు

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 08**

శాసనసభాపతి స్థానాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి హరీష్ రావు బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.శాసనసభలో జరుగుతున్న చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభను ఏ విధంగా నడపాలనే దానిపై స్పీకర్‌ను నిర్దేశిస్తూ, ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని శ్రీధర్ బాబు సూటిగా ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ వ్యవస్థను బెదిరించేలా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని మండిపడ్డారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో ఏదో అనుకుంటే లేదా భావిస్తే అన్న చర్చలకు తావులేదని, ఏం జరిగిందనేది వీడియోల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తోందని మంత్రి తేల్చిచెప్పారు మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన సంఘటనలకు ప్రభుత్వం లేదా స్పీకర్ ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న విమర్శలను శ్రీధర్ బాబు కొట్టిపారేశారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనపై ఇప్పటికే పూర్తి నివేదిక సమర్పించాలని శాసనసభాపతి స్వయంగా ఆదేశాలు జారీ చేశారని స్పష్టం చేశారు. అయితే మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని చూపిస్తూ, అదే సమయంలో స్పీకర్‌ను నేరుగా అవమానించిన అత్యంత తీవ్రమైన పరిణామాన్ని అసలు పట్టించుకోవద్దని ప్రతిపక్ష నేతలు మాట్లాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఉన్నతమైన స్పీకర్ వ్యవస్థ పై దాడి జరిగిన వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, చట్టసభ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచిత వైఖరిని ఖండిస్తూ నిరసన

- కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిరసనగా ఖానాపూర్‌లో మహిళల భారీ ఆందోళన
- ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు అమలు చేయాలని డిమాండ్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా, సెప్టెంబర్ 8:**



కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో మహిళలతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా పోలీసులతో అడ్డుకోవడంతో పాటు, మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావిస్తూ ప్రజల గొంతుకగా నిలిచే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు, ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించే హక్కు ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసుల వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వారి గౌరవానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా వ్యవహరించిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతును అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జాన్సన్ నాయక్ విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలును కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ చౌరస్తాలో రాజకీయ రణరంగం

**కాంగ్రెస్--బీఆర్ఎస్ ఎదురెదురు.. నినాదాలు, తోపులాటతో ఉద్రిక్తత**

**బోధన్ పట్టణ ప్రతినిధి సెప్టెంబర్ 5 ( మన దునియా):**



నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన వేర్వేరు కార్యక్రమాలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఎమ్మెల్సీ కాకా మధుసూదన్ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దహనం చేశారు.అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించేందుకు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఎదురెదురుగా రావడంతో నినాదాలతో వాతావరణం వేడెక్కింది. మాటామాటా పెరగడంతో ప్లకార్డులు చింపుకోవడం, తోపులాట చోటుచేసుకుంది. కొంతసేపు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై వినతిపత్రం సమర్పించారు.మరోవైపు స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నేతలపై విమర్శలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వడం సిగ్గుచేటని వ్యాఖ్యానిస్తూ కాంగ్రెస్ నాయకులు విగ్రహానికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి మూకమామిడిలో వార్డు సభలు






### సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

**మన దునియా,ములకలపల్లి సెప్టెంబర్ 08**

గ్రామంలోని ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ (విజిపిపి) లో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించడమే కాకుండా.ప్రతి వార్డులోకి వెళ్లి వార్డు సభలు నిర్వహించారు.ప్రతి వార్డులో పనులు గుర్తించి రాబోయే మూడు సంవత్సరాలకు ప్రణాళిక ఏర్పాటు కొరకు మరియు వార్డులలో పర్యటించి అక్కడి ప్రజలతో మమేకమై వారి సమస్యలైన రోడ్లు,డ్రైనేజీ,తాగునీరు,వీధి దీపాలు,పింఛన్లు,ఇళ్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వారి నుండి వినతులను స్వీకరించి రిజిస్టర్లో నమోదు చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ.గ్రామసభ అంటే ప్రజలు మా దగ్గరకు రావడం.వార్డు సభ అంటే మేము ప్రజల దగ్గరకు వెళ్లడం.ప్రజల సమస్యలు వారి వీధుల్లోనే ఉంటేనే సరిగ్గా అర్థమవుతాయి.అందుకే వార్డుల్లో సభలు పెడుతున్నాము.వచ్చిన ప్రతి సమస్యను రాబోయే మూడేళ్ల (విజిపిపి) ప్రణాళికలో చేర్చి పరిష్కరిస్తాము అని అన్నారు.పంచాయతీ పరిధిలో ప్రతి వార్డులో వార్డు సభలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ వార్డు సభలలో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్ కుమార్, టి.ఏ తాటి సత్యం,వార్డు మెంబర్లు కణితి చిన్న వెంకటేశ్వర్లు,కిసారి రాజ్ కుమార్,తనం పావని,కోర్సా శ్రీకృష్ణ,బచ్చల చైతన్య కుమారి మరియు ఉపాధిహామీ సిబ్బంది మెట్లు కీసరి గోపాలరావు,కీసరి రామజోగి,గడ్డం రాజబాబు మరియు గ్రామ పెద్దలు కీసరి గోపయ్య,బాబురావు,గడ్డం బాబు,సవలం సత్యనారాయణ,ఎస్.కె అబ్దుల్లా,పున్నం వెంకన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ వ్యాఖ్యలతో భగ్గుమన్న కాంగ్రెస్.. దిష్టిబొమ్మ దహనం





**మన దునియా,నంగునూర్:సెప్టెంబర్ 08**

నంగునూర్: అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు, వాటిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని, హుందాగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్‌పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్. రాజ్ బహుదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ ఏఎంసి డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, గొట్టం రంగారెడ్డి, తిప్పని రాజేశ్వర్, జీవన్ నాయక్,ప్రభాకర్,చేర్యాల కృష్ణా, పాక్స్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, కాటం. కనకయ్య, వల్లద్రి రవీందర్ రెడ్డి పదిరే శ్యామ్ రెడ్డి,పిల్లి మహేష్, బర్రె సంతోష్ రెడ్డి,బోజు రాములు, గడ్డం కరుణాకర్ రెడ్డి,నాయిని సంపత్ రెడ్డి, మాదే మహేష్ జిన్నా సంపత్ రెడ్డి నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ నిజామాబాద్ చైర్మన్ శ్రీలత ఆకస్మికంగా తనిఖీ

**నిజామాబాద్ జిల్లా. మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లా బోధన్ శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ నిజామాబాద్ చైర్మన్ మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయ నిర్వహణ, పుస్తకాల లభ్యత మరియు పాఠకులకు అందుతున్న సౌకర్యాలను వారు పరిశీలించారు. మొదటిసారి బోధన్ గ్రంథాలయాన్ని సందర్శించిన కార్యదర్శి శ్రీలత గ్రంథాలయ పాఠకులు మరియు సిబ్బంది ఆత్మీయ సత్కారం అందించారు.?అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలో దాత సత్తేందర్ గౌడ్ విరాళంగా అందజేసిన పలు రకాల మొక్కలను చైర్మన్ కార్యదర్శి నాటారు. గ్రంథాలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ మొక్కలతో పాటు వాటి సంరక్షణ కోసం గ్రీన్ నెట్, వాటర్ ట్యాంకి సౌకర్యాన్ని కల్పించిన దాత సత్తేందర్ గౌడ్ చైర్మన్ మరియు కార్యదర్శి ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, సిబ్బంది మరియు అధిక సంఖ్యలో పాఠకులు పాల్గొన్నారు.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం
సెప్టెంబర్ । బుధవారం । 9 । 2026



# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి





**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. కలెక్టరేట్?లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

పీసప్

అధికారులకు కీలక సూచనలు

సీపీ సాయి చైతన్య అదనపు కలెక్టర్ భుజంగరావు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ జాతర సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా కృషి చేస్తామని అన్నారు.

రోడ్ల మరమ్మతులు

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరు కూడా విద్యుదాఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

ట్రాఫిక్?కు అంతరాయం లేకుండా..

ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వినాయక మండపాలు ప్రతిష్టించాలని సూచించారు. ఎనిమిది అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలను మాత్రమే బాసర గోదావరిలో నిమజ్జనానికి అనుమతిస్తామని, అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఉమ్మెడ వద్ద నిమజ్జనం చేయాలని సూచించారు. భారీ శబ్దాల వల్ల చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున మండపాల వద్ద డీజే సౌండ్లను నిషేధించినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు.

మద్యం విక్రయాలపై ఆంక్షలు..

గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ వేడుకల సందర్భంగా నిర్ణీత రోజుల్లో మద్యం విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని అవగాహన కల్పిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. మేయర్ ఉమారాణి, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ పాల్గొన్నారు



# రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం.





## శాస్త్రీయ అధ్యయనాలు, భద్రతా ప్రమాణాల సమగ్ర పరిశీలన అనంతరమే నిర్ణయం.

## జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు.

**మన దునియా,ములుగు జిల్లా,రామప్ప:సెప్టెంబర్ 08**

యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటాపూర్ మండల పరిధిలో చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పనుల వల్ల కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాలపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారు.ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. రామప్ప దేవాలయ పరిరక్షణ, పర్యావరణం, శాస్త్రీయ అధ్యయనాలు, నిరంతర పర్యవేక్షణతోపాటు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాల పై విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేశామని, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జీఎం జి. దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం పి. సైదులు, ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్. సునీత, పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు బి. గంగాదేవి, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు అజిత్ ఎం.ఎస్., వంశీకృష్ణ జ్యోతి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు జె. శ్రీధర్‌రావు, ఆచార్య ఎం.పాండురంగారావు, పాలంపేట సర్పంచ్ సీహెచ్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి కె. వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి రజని, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ, ఇర్రిగేషన్ ఈ ఈ నారాయణ, వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు, ఎం పి డి ఓ రాజు, సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో రూ.1.42 కోట్ల విలువైన హాష్ ఆయిల్ స్వాధీనం

**ఒకరి అరెస్ట్.. 11.319 కిలోల హాష్ ఆయిల్, సెల్‌ఫోన్ స్వాధీనం**

**కొత్తూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జునరెడ్డి వెల్లడి**



**మన దునియా,కొత్తూర్:సెప్టెంబర్ 08**

కొత్తూర్ పోలీసులు, ప్రత్యేక ఆపరేషన్ బృందం (ఎస్ఓటీ), షాద్‌నగర్ జోన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా హాష్ ఆయిల్‌ను తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మొత్తం 11.319 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.1.42 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్ముల్‌నర్వలోని పి అండ్ జీ కంపెనీ రోడ్డు దాటి వెళ్లిన అనంతరం అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని హెచ్. ధృవ్ అలియాస్ ధృవ్ జోషి (30)గా గుర్తించారు. అతను మెద్చల్--మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్‌కు చెందినవాడని, ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద ఉన్న కళాశాల బ్యాగ్‌ను తనిఖీ చేయగా 11 ప్యాకెట్లలో హాష్ ఆయిల్ లభించింది. ముదురు గోధుమ రంగులో చిక్కటి ద్రవ రూపంలో ఉన్న ఈ పదార్థానికి గంజాయి నుంచి తయారైన హాష్ ఆయిల్‌కు ఉండే ప్రత్యేకమైన ఘాటైన వాసన ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో నిందితుడు ఈ హాష్ ఆయిల్‌ను ఒడిశా రాష్ట్రానికి చెందిన రోహిత్ అనే వ్యక్తి వద్ద నుంచి తీసుకుని, కొత్తూర్ పరిధిలో అవసరమైన వారికి విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ రవాణా ద్వారా ఆర్థిక లాభం పొందేందుకు కమిషన్ లేదా వాటా ప్రాతిపదికన పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 11 ప్యాకెట్లలో ఉన్న మొత్తం 11.319 కిలోల హాష్ ఆయిల్‌తో పాటు ట్విలైట్ పర్పుల్ రంగులోని రియల్‌మీ 12ఎక్స్ 5జీ స్మార్ట్‌ఫోన్ ఉంది. ఈ అరెస్ట్, స్వాధీనం చర్యలు షాద్‌నగర్ జోన్ డీసీపీ సి. శిరీష, షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో, కొత్తూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు..

# ఓయూ స్నాతకోత్సవ వేదిక వద్ద విద్యార్థుల నిరసన

**రూ. 2,500 కట్టించుకుని.. స్నాక్స్ ఇవ్వరా ?**

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 08**



ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో గవర్నర్ నిష్క్రమణ అనంతరం తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఠాగూర్ ఆడిటోరియంలో స్నాతకోత్సవ సభ ప్రారంభమైన తర్వాత, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగించి, పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేసిన అనంతరం అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు.గవర్నర్ ఉన్నంతవరకు సజావుగా జరిగిన కార్యక్రమం, ఆయన వెళ్లిపోవడంతోనే అసలు సమస్యలు మొదలయ్యాయి. విద్యార్థులంతా ఒకేసారిగా బయటికి వచ్చేయడంతో వారిని అదుపు చేయడం భద్రతా సిబ్బందికి కష్టంగా మారింది.రూ. 2,500 కట్టించుకుని.. స్నాక్స్ ఇవ్వరా ?

గవర్నర్ వెళ్లిన తర్వాత ఆడిటోరియం ప్రవేశ ద్వారం వద్ద గందరగోళం నెలకొంది. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి విద్యార్థి వద్ద నుంచి యూనివర్సిటీ యంత్రాంగం రూ. 2,500 చొప్పున ఫీజు వసూలు చేసింది. అయితే ఉదయం నుంచి వేచి ఉన్న తమకు కనీసం మంచినీళ్లు కూడా పూర్తిస్థాయిలో అందించలేకపోయారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆడిటోరియం ఎంట్రన్స్ గేటు దగ్గర రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా, ఒక్కొక్కరి నుంచి రూ. 2,500 వసూలు చేసి, కనీస ఏర్పాట్లు చేయలేదని, స్నాక్స్ బాక్సులు అందరికీ అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఏర్పాట్లలో ఓయూ అధికారుల వైఫల్యం..

మొత్తంగా 85వ స్నాతకోత్సవం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లలో ఓయూ అధికారుల సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు, నిర్వహణ తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ప్రతిష్ఠాత్మక కార్యక్రమం నిర్వహణలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

మన దునియా
RNI Number
TTITTI/2023/85680
మన అక్షరం – మన ప్రపంచం

## వివాదాల తర్వాత మళ్లీ కలిశారు.. రవి మోహన్ సినిమాకు కెనీషా సంగీతం!



కొన్ని నెలల క్రితం వివాదాల కారణంగా సోషల్ మీడియాకు, సంగీత ప్రపంచానికి దూరమైన సంగీత దర్శకురాలు కెనీషా ఫ్రాన్సిస్ మళ్లీ రీఎంట్రీ ఇచ్చారు. రవి మోహన్ దర్శకత్వం వహిస్తున్న 'యాన్ ఆర్డినరీ మ్యాన్' చిత్రానికి ఆమె సంగీత దర్శకురాలిగా పనిచేయనున్నారు. గతంలో వీరిద్దరి మధ్య ఉన్న సంబంధంపై తీవ్ర దుమారం రేగిన నేపథ్యంలో, ఇప్పుడు వృత్తిపరంగా వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటం చర్చనీయాంశమైంది. రవి మోహన్ స్టూడియోస్ సోమవారం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. "సంగీత ప్రపంచంలోకి ఒక కొత్త స్వరం.. ఒక సరికొత్త అధ్యాయం. మీకు తెలిసిన కళాకారిణిని మీరు ఎన్నడూ వినని రీతిలో మళ్లీ పరిచయం చేస్తున్నాం. 'యాన్ ఆర్డినరీ మ్యాన్' చిత్రబృందంలోకి కెనీషాకు స్వాగతం" అని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీనిపై కెనీషా స్పందిస్తూ.. "నాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. నా అత్యుత్తమ సంగీతాన్ని ఈ చిత్రానికి అందిస్తానని హామీ ఇస్తున్నాను" అని తెలిపారు. మే నెలలో రవి మోహన్‌తో సాన్నిహిత్యంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో, కెనీషా సోషల్ మీడియాకు దూరమవుతున్నట్లు ప్రకటించారు. తన వాదనను వినిపించే అవకాశం ఎవరూ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, సంగీతానికి, సామాజిక జీవనానికి స్వస్తి పలుకుతున్నట్లు అప్పట్లో వెల్లడించారు. "దేవుడు గెలిచే వరకు నేను ఆన్‌లైన్‌లోకి రాను. స్త్రీవాదం గెలిచింది, సంతోషం ఓడిపోయింది" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో సంచలనం సృష్టించాయి.

## యశ్ 'టాక్సిక్'కు ఊహించని షాక్.. 150 కోట్ల నుంచి 30 కోట్లకు పడిపోయిన ఓటీటీ డీల్?

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వచ్చిన పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. 'కేజీఎఫ్ 2' లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత యశ్ నటించిన సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, థియేటర్లలో ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఈ ప్రభావం ఇప్పుడు సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులపై తీవ్రంగా పడినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విడుదలకు ముందు కోట్లు కుమ్మరించేందుకు సిద్ధపడిన ఓటీటీ సంస్థలు, ఇప్పుడు ముఖం చాటేస్తున్నాయని సమాచారం. విడుదలకు ముందు 'టాక్సిక్' సినిమాకున్న హైప్‌ను క్యాష్ చేసుకునేందుకు ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ డిజిటల్ హక్కుల కోసం ఏకంగా రూ.150 కోట్లు ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది. యశ్ క్రేజ్, సినిమాలో స్టార్ హీరోయిన్లు, బోల్డ్ కంటెంట్‌తో కూడిన టీజర్ వంటి అంశాలు ఈ భారీ ఆఫర్‌కు కారణంగా నిలిచాయి. అయితే, థియేటర్లలో సినిమా బ్లాక్‌బస్టర్ అయితే డిజిటల్ రైట్స్ విలువ రూ.200 కోట్లకు పైగా పలుకుతుందని భావించిన నిర్మాతలు ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. కానీ, బాక్సాఫీస్ వద్ద సినిమా ఫలితం తారుమారు కావడంతో ఇప్పుడు ఓటీటీ లెక్కలు పూర్తిగా మారిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కుల కోసం కేవలం రూ.30 కోట్లు మాత్రమే ఆఫర్ చేసినట్లు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. విడుదలకు ముందు వచ్చిన ఆఫర్‌తో పోలిస్తే ఇది దాదాపు ఐదో వంతు మాత్రమే. సినిమా ఫలితం ఓటీటీ మార్కెట్‌ను ఎంతలా ప్రభావితం చేస్తుందో చెప్పడానికి ఇదే నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ రూ.150 కోట్ల ఆఫర్, ప్రస్తుత రూ.30 కోట్ల డీల్‌పై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు, ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ లభించడం శాటిలైట్ హక్కుల విషయంలో కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. బోల్డ్ కంటెంట్ కారణంగా సినిమాను యథాతథంగా టీవీలో ప్రసారం చేయడం కష్టం. అందుకే, కుటుంబ ప్రేక్షకుల కోసం కొన్ని సన్నివేశాలను తొలగించి లేదా మార్పులు చేసి, ప్రత్యేకంగా ఓ వెర్షన్‌ను సిద్ధం చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే ఓటీటీ కోసం కూడా మరో వెర్షన్‌ను రూపొందించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.










## చిరు కూతురు 'అమ్ములు'గా అనశ్వర.. 'కాకా' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కాకా' నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో చిరంజీవి కూతురిగా నటిస్తున్న మలయాళ నటి అనశ్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా 'అమ్ములు' పాత్రను పరిచయం చేస్తూ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. విడుదలైన పోస్టర్‌లో అనశ్వర రాజన్ మెడికల్ కాలేజీ విద్యార్థినిగా అమాయకమైన లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఆమె నవ్వుతూ కనిపిస్తుండగా, వెనుక రక్షణ కవచంలా మెగాస్టార్ చిరంజీవి నీడ కనిపిస్తోంది. ఈ పోస్టర్ కూతురి జీవితంలో తండ్రి ప్రాముఖ్యతను, వారి మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని తెలియజేసేలా ఉంది. సినిమాలో ఆమె పాత్ర కథాగమనంలో చాలా కీలకమని చిత్ర యూనిట్ పేర్కొంది. తన సహజ నటనతో మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ సినిమాలో అత్యంత ముఖ్యమైన పాత్రను దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా జరుగుతోంది. తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో పాటు మాస్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com